❖•❖•❖ 17 ❖•❖•❖

# యూదుల మహా సభ (సన్హెడ్రిన్) తీర్పు

*"ఉదయము కాగానే, ప్రజల పెద్దలును ప్రధాన యాజకులును శాస్త్రులును సభకూడి, ఆయనను తమ మహా సభలోనికి తీసికొనిపోయి – 'నీవు క్రీస్తువైతే మాతో చెప్పుమనిరి. అందుకాయన – నేను మీతో చెప్పిన యెడల, మీరు నమ్మరు; అదియుగాక నేను మిమ్మును అడిగినయెడల, మీరు నాకు ఉత్తరము చెప్పరు' " (లూకా 22:66-68).*

ఉదయమైనప్పుడు వారి అంతిమ తీర్పు నిమిత్తము యేసు యూదుల మహా సభ (సన్హెడ్రిన్

సభ) యెదుటికి తీసికొనిపోబడ్డాడు. మహా సభాధ్యక్షుడు, కయప యేసు దేవదూషణ చేసిన దోషి అని అదివరకే తీర్పు నిచ్చాడు (మత్తయి 26:65), మరియు యేసు మరణమునకు పాత్రుడని ఆయనతో కూడా ఉండిన మహా సభ సభ్యులు ప్రకటించవలెనని కోరాడు (మత్తయి 26:66). ఈ ముందస్తు తీర్పుల తరువాత, మన ప్రభువు అపహసింపబడ్డాడు, ఎగతాళి చేయబడ్డాడు, పిడిగుద్దులు తిన్నాడు, మరియు చెంప దెబ్బలు కొట్టబడ్డాడు. "అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి – 'క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి' " అని మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 26:67). దేవుని కుమారుడు అవమానింపబడినాడని ఊహించుకొనుట కష్టముగా నున్నది! యూదులలోని సర్వోచ్చమైన న్యాయస్థాన సభ్యులు అధికారపూర్వకమైన తీర్పు ప్రకటింపబడక మునుపే యేసు కొట్టబడుటలో పాల్గొన్నారని స్పష్టమగుచున్నది!

యేసు మహా సభ యెదుట నిలువబడియుండగా, ఆయన తన దెబ్బల చేత కందిపోయిన ముఖములో, చింపిరిగా విరియబోయబడిన జుత్తులో, మరియు చినిగిపోయిన వస్త్రములలో ఆయన అనుభవించుచుండిన క్రూరమైనదియు పిచ్చి ఆవేశంతో కూడినదైన అపహాస్యమును చిత్రీకరణగా వర్ణించాడు ఆయన ఎవరి ముందైతే నిలువబడి యుండెనో ఆ న్యాయవాదులు ఆయన విచారణకు ముందుగానే ఆయనకు తీర్పు నిచ్చారు; కానీ ఇప్పుడు రోమా ప్రభుత్వాధికారి, పిలాతునొద్దకు పంపబడక మునుపు సాంప్రదాయికమైన తీర్పు ఇప్పుడు తీర్చబడుచున్నది కాబోలు అని చూచేవారందరు అనుకొనునట్లు, వారు ఆయనను మరలా విచారించవలెనని ఆశించారు. బహుశ, ఈ సమావేశములో వారు పిలాతును ఒప్పించుటకుగాను అతనికి చెప్పదలచిన తుది తీర్పును పూర్తిచేయుటకు ప్రయత్నించి యుండవచ్చును. పిలాతు తక్షణమే ఇష్టపూర్వకముగా అంగీకరించు నివేదికను, అతడు మరణ దండన తీర్పునిచ్చునట్లు అతనిని బలవంతము చేయు రుజువును అతని ముందుంచుట వారి కర్తవ్యముతో కూడిన బాధ్యతయై యుండును.

"నీవు క్రీస్తువైతే, ఆ మాట మాతో చెప్పుము" అని స్వాధికారముతో అడుగుటతో వారు యేసును పరీక్షించుటకు మొదలుపెట్టారు. యేసు ఈ ప్రశ్నకు అదివరకే పిలాతు యెదుట వారికి నిశ్చయమైన సమాధానమిచ్చాడు (మత్తయి 26:63, 64). ఏదిఏమైనా, ఆయన తనను తానే దోషిగా నిర్ధారించు రుజువు నిచ్చునట్లు వారి ప్రయత్నములను కొనసాగించుచుండిరి గనుక వారు యేసు తన జవాబును పునరుచ్చరింపవలెనని ఆశించారు. ఆయన మాటలు ఈ మహా సభవారిని వారి దురుద్దేశపూర్వకమైన పన్నుగడలను గూర్చి మందలించాయి: "నేను మీతో చెప్పిన యెడల మీరు నమ్మరు. అదియుగాక నేను మిమ్మును అడిగినయెడల మీరు నాకు ఉత్తరము చెప్పరు" (లూకా 22:67బి, 68). వారు యేసును గూర్చిన సత్యమును (మత్తయి 26:59) వెదకడము లేదని వారి గతములోని (మత్తయి 21:23–27) మరియు ప్రస్తుతకాలమందలి చర్యలు సూచించినవి. ఆయన దైవత్వమును గూర్చిన సత్యము యొక్క రుజువును వారికి ఎంత స్పష్టముగా నివేదించినను, వారికి అది ఎన్ని మారులు బయలుపర్చబడినను దానితో నిమిత్తము లేకుండా, వారు ఈ సత్యమును తృణీకరించవలెనని అదివరకే తీర్మానించుకొన్నారని ఆయన ఎరిగియుండెను.

వారి ఎంపికల పరిణామమేమై యుండునో దాని గూర్చి యేసు వారికి గుర్తుచేశాడు. ఆయన, "ఇది మొదలుకొని మనుష్యకుమారుడు మహాత్యముగల దేవుని కుడిపార్శ్వమున

ఆసీనుడగును" అని వారితో (లూకా 22:69), దేవుడు ఎల్లప్పుడు ఒక తరుణము వెంబడి మరొక తరుణమును అనుగ్రహించు దేవుడై యున్నాడు. మనము ఆయన చిత్తమునకు లోబడవలెనని ఆయన నిర్విరామముగా మనకు విజ్ఞప్తిచేయుచునే యుండును, వారు అనుకుంటే వెనుదిరుగగల ఒక నిర్దిష్ట సీమను దాటి వెళ్ళిపోయారని యేసు ఎరిగి యుండినప్పటికిని, ఆయన ఎవరైయున్నారో అను సత్యముతోను భవిష్యత్తులో ఆయన ఏమి చేయనైయుండెనో అను వివరముతోను ఆయన వారిని హెచ్చరించుచు సవాలు చేయుచునే యుండెను. అంతకు మునుపు ఆయన కయప యెదుట నిలబడి యున్నప్పుడు, భవిష్యత్తులో వారికి సంభవింపనై యుండిన దాని గూర్చిన ఈ ప్రవచనమును ఆయన పేర్కొన్నాడు (మత్తయి 26:64). అదే విషయాన్ని మరలా పేర్కొంటూ, బహుశ ఒక కృపాచర్యగా, ఆయన నిత్య న్యాయాధిపతి, వారికి ఒక దినాన తీర్పు తీర్చునని సమావేశమై యుండిన మహా సభ వారికి గుర్తుచేశాడు.

యూదుల మహా సభ మరొక ప్రశ్న వేసినది: "అట్లయితే, నీవు దేవుని కుమారుడవా?" అని. ఈ ప్రశ్నకు జవాబుగా, "మీరన్నట్టు నేనే ఆయనను" అని యేసు జవాబిచ్చాడు (లూకా 22:70). ఆయన దేవుని కుమారుడైయుండెనని చాటించుటకు కయప యెదుటను యూదుల మహా సభ యెదుటను ఆయనకు తీర్చబడుచుండిన తీర్పులు ముగియునంత వరకు ఆయన వేచియుండెను. తండ్రియైన దేవుడు దానిని ఉద్ఘాటించాడు (మత్తయి 3:17). పేతురు దానిని ప్రకటించాడు (మత్తయి 16:16); కానీ యేసు ఈ విషయాన్ని ఏ ఒక్కరును అపార్థము చేసుకొనుటకు ఎటువంటి అవకాశమైనను కలుగజేయని స్పష్టతతో తెలియజెప్పుటకు అనువైన అదనుగా ఈ విశాలమైన గదులను ఎన్నుకొన్నాడు.

మహా సభ ఈ వ్యక్తిగత ఘోషణను వారి విచారణలో ఒక ప్రాముఖ్యమైన విషయముగా చేసినది. "మనకిక సాక్షులతో పని ఏమి? మనము అతని నోటిమాట వింటిమిగదా" అని వారన్నారు (లూకా 22:71). వారి తీర్మానమును వారు నిర్ణయించారు. అదొక ఏకగ్రీవ తీర్మానమై యుండును. నీకొదెము మరియు యోసేపు అక్కడ లేరనుటలో, సందేహమేమీ లేదు (మార్కు 15:43; యోహాను 19:39 చూడుము). యేసు దేవదూషణ చేశాడని మహా సభవారు కనుగొన్నారు, గనుక మరణదండన తీర్పు కొరకు వారు వేచియున్నారు.

ఈ విధముగా, యేసు యొక్క మొదటి మూడు తీర్పులు – యూదులు, లేక మతసంబంధమైన తీర్పులు – ముగిసినవి, ఈ తీర్పులలో నుండి బయటికి వచ్చుట దోషియని నిర్ధారణచేయు ఒక భారీ తీర్పై యుండెను: దేవదూషణ చేసిన నేరము. వారు ప్రయాసపడి కల్పించి కనుగొన గలిగిన రుజువుతో వారు చేయగలిగినదంతా అంతే. యేసు శత్రువులు ఈ తుది తీర్పు నిమిత్తము వాస్తవములను వక్రముగా మళ్ళించవలసివచ్చినది, కానీ వారు ఎటువంటి మనస్సాక్షి గద్దింపైనా లేకుండానే ఈ పని చేయవలసి వచ్చినది. వారి తీర్పు పిలాతు మనస్సుకు సమ్మతమగు నివేదిక కావలంటే వారు యేసు మాటలను మరి ఎక్కువగా వక్రీకరించవలసి యుండునని వారికి తెలియును, యేసు ఒక ప్రత్యర్థియైన రాజైయున్నాడని ఆయన స్వాధికారముతో చెప్పాడను భావము ఆయన పలికిన మాటలలో ఉన్నదని పిలాతుకు అర్థమయ్యేట్లు చేయుట, పిలాతు తీర్పు కూడా వారి అభిప్రాయముతో ఏకీభవించునదై యుండునట్లు చూచుటకు ఒకే ఒక మార్గమై యుండినది. ఈ పని ఎలాగైనా వారు చేస్తారు, గనుక "ఆయనను బంధించి, తీసికొనిపోయి, అధిపతియైన పొంతిపిలాతునకు అప్పగించిరి" (మత్తయి 27:2).

*ఎవరు కూడా చూచుటకు నిరాకరించువాడున్నంత గ్రుడ్డిగా లేరని అవినీతిమయమైన ఈ న్యాయస్థానము మనకు గుర్తుచేయుచున్నది.* యేసును గూర్చిన సత్యమును వారు అంగీకరించిరని తీర్మానించుట ద్వారా, వారు ఏ మానవుడైనా ఎరుగని కటిక చీకటియను గోతి లోనికి వారంతటవారే దూకి మునిగిపోయారు. "గ్రుడ్డివారై యుండుటను మించిన ఘోరాతి ఘోరమైనదేమిటి?" అని హెలెన్ కెల్లర్‌ను[1] ఒకసారి ఎవరో ప్రశ్నించారు. అందుకామె, "చూడగల మంచి కళ్లుండియు చూడలేకపోవుట" అని సమాధానమిచ్చినది. ఈ నాయకులు శిక్షణ పొందిన మనస్సులు, అధికారముండిన పదవులు, మరియు నేర్చుకొని అభ్యసించుటకు ఎన్నడూ లేని అతి గొప్ప అవకాశము కలిగియుండిరి; కానీ సత్యము కొరకైన అపేక్ష వారి హృదయములలో లేనందువలన వారు ఈ విషయాలన్నిటిలోను నష్టంకలిగించుకొన్నారు.

*అసత్య మతము ఎంత అవినీతమయమైనదై ఎంత దురంతమైనదై యుండగలదో లౌకికాశలతో ఆడంబరముగా నుండిన ఈ న్యాయాధిపతులు ప్రదర్శించుచున్నారు.* వారు పౌర సంబంధమైన న్యాయవాదులు కారు; వారు ఆ నాడు ఉన్నత పదవులలో ఉండిన మత నాయకులై యుండిరి. వారి మతము వారు అనుదినము దేవుని చిత్తమును వెదకుచుండు దైవభక్తిగలవారై యుండునట్లు మార్చుటకు బదులుగా, క్రూరులైన నిరంకుశ పాలకులై యుండునట్లు చేసినది. వారు సత్యమును భంగపరచుటకు వెదకువారుగా మాత్రమేగాక, ఎట్టి పరిస్థితులలోనైనను, దైవీకమైన సత్యమును మూర్తీభవించి దానికి నిలయమై యుండినవానినే నాశనము చేయువారయ్యారు. వారు ఒకరితో మరొకరు రహస్యంగా దుష్ట విషయాల గూర్చి సమ్మతించుటకు ఇష్టపడువారుగాను, రుజువును అబద్ధముగా మార్చువారుగాను, అబద్ధములాడువారుగాను, అవమానపరచువారుగాను మరియు వారి శక్తి నంతటిని నిర్దోషియైనవానిని సిలువ వేయుటకు వినియోగించువారుగాను తయారయ్యారు – ఇదంత కూడ వారు ఆయన తెచ్చిన సత్యమును తృణీకరించుటనుబట్టియే, బహుశ క్రొత్త నిబంధనలోని మనస్సుకు అత్యధిక బాధను కలిగించు మాటలు పౌలు, "నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపకపోయిన" వారి గూర్చి ఇచ్చుచున్న వివరణ యొక్క ముగింపులో ఉన్నవి. ఆయన "ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారందరును శిక్షావిధి పొందుటకై, అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" అని వ్రాశాడు (2 థెస్సలొనీకయులు 2:10–12).

*యేసుకు తీర్పు తీర్చిన వీరు యేసు చెప్పిన ఉపమానము యొక్క సత్యమును – మానవుని హృదయమే ప్రధానాంశమని దృఢపర్చుచున్నారు (లూకా 8:5–15.)* రుజువు లేనందువలననేనా ఈ న్యాయాధిపతులు దేవుని కుమారని తృణీకరించారు? లేదు, యేసు చేసిన అద్భుతములు, పరలోకము నుండి వచ్చిన ప్రకటన, యేసు యొక్క పరిపూర్ణమైన జీవితము, మరియు ఆయన చేసిన అలౌకిక బోధలు అందుకు సాక్ష్యమైయుండినవి. వారికి సర్వోత్కృష్టమైన రుజువుండినది! వారు ఆయన చెప్పిన సంగతులను విననందువలననేనా వారు ఆయనను తృణీకరించారు? లేదు, వారు ఆయన మాటలు విన్నారు; అంతమాత్రమే గాక వారు సత్యమును గూర్చి ఆయన చెప్పిన మాటలనే ఆయనకు విరోధముగా వాడుకొనుటకు వారు ప్రయత్నించారు కూడ. వారు యేసును తృణీకరించుట సత్యమును గూర్చిన చిరకాల గ్రహింపునకు దారి తీయుచున్నది: మానవుడు వాని ఆంతర్యములో – వాని ఆత్మలోను వాని

హృదయములోను – ఏమై యున్నాడో వాడు సత్యము యెడల స్పందించు విధానమును నిశ్చయించునది అదే. ఈ విషయాన్ని యేసు మనకు తెలియజెప్పలేదా? “అడుగుడి, మీకియ్యబడును; వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును” (మత్తయి 7:7, 8). ఆయన నైతికంగాను మానసికంగాను వికాసమును కలిగించు నమ్మకమును కూడా కలిగించుచున్నాడు: “ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయు నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవునివలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును” (యోహాను 7:17).

*చరిత్రలో శ్లాఘనీయమైన స్థలాలు సత్యముతో మనమేమి చేయుదుమో దానితో రూపుదిద్దబడుతాయి, గాని మరి దేని చేతను కాదని ఈ మహా సభ సభ్యులు మనకు బోధించుచున్నారు.* ప్రజాదరణ, పేరుప్రఖ్యాతులు గాంచిన పదవులు సిరిసంపదలు, మరియు కీర్తింపబడు అవకాశములు వడలుపోయిన పూవుల వలె నిష్ప్రయోజనకరమైనవై, త్వరగా వాడిపోవును. నిజముగా, లోకము మరియు లోకాశలు గతించి పోవును; “కాని దేవుని చిత్త ప్రకారము చేయువాడు నిరంతరము నిలుచును” (1 యోహాను 2:17బి). యూదుల ఈ మహా సభ సభ్యులు సత్యమును తృణీకరించారు కాబట్టి చిరాకుతో జ్ఞాపకము చేసికొనబడుదురు; ఏదిఏమైనా, సత్యములో నిలిచియుండువాడు మానవుని చేత ఆనందముతో జ్ఞాపకము చేసికొనబడును మరియు దేవుని చేత వాని పేరు జీవ గ్రంథములో లిఖింపబడును.

❖◆❖◆❖

*యేసు సత్యము – మతసంబంధమైన మరియు రాజకీయ సంబంధమైన విజ్ఞులు ఆశించక అంగీకరించుటకు నిరాకరించిన సత్యము – చెప్పాడు కాబట్టి ఆయన సిలువ వేయబడ్డాడు. ఆయన దేవుని కుమారుడనియు ఇశ్రాయేలీయుల మెస్సీయా అనియు క్రైస్తవ సంఘమునకు సంబంధించిన మహాసభవారికి ఆయన చాటి చెప్పాడు కాబట్టి, ఆయనే రాజైన, క్రీస్తని, విశ్వవ్యాప్తమైన ప్రజల హక్కులను కాపాడు ప్రత్యేక న్యాయస్థానము యెదుట స్వాధీకారముతో తెలియజెప్పాడు కాబట్టి, ఆయన సిలువ వేయబడ్డాడు. ఈర్ష్యగల మతసంబంధమైన మహా సభ దాని అత్యంత విలువైన మతమును, దాని నాయకత్వ పదవిని, ప్రజలపై దానికుండిన పట్టును, శ్రేయస్సుగానున్న దాని చోటును కోల్పోవుటకు కోరలేదు కాబట్టి ఆయన సిలువ వేయబడ్డాడు.*